క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హఫీజ్‌పేట్: చందానగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు ప్రక్రియలో భాగంగా సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ పేర్కొన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మాతృశ్రీనగర్ ఫీడర్ పరిధిలో మాతృశ్రీనగర్, కల్వరి టెంపుల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు మాధవనగర్ ఫీడర్ పరిధిలో మాధవనగర్, మియాపూర్ ప్రధాన రోడ్డు ప్రాంతాలు, కల్వరి టెంపుల్ రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సన్మానం



సిద్ధార్థ బంగారును సన్మానిస్తున్న దృశ్యం

హఫీజ్‌పేట్: చందానగర్ పీజేఆర్ స్టేడియంలో ఇటీవల దేశవ్యాప్తంగా 13వేల కిలోమీటర్లు, 11 నెలలో సైకిల్ రైడ్ పూర్తి చేసుకున్న సిద్ధార్థ బంగారుకు ఆదివారం సన్మానం కార్యక్రమం నిర్వహించారు. మాజీ హైకోర్టు జడ్జి బి.చంద్రకుమార్, కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, జగదీశ్వర్ గౌడ్ సిద్ధార్థను సత్కరించి సన్మానించారు. శ్రీనివాస చారి, వరప్రసాద్ గురుపరాజు, ఎన్జీఓలు వెస్కో, వీకేఎఫ్ఎస్‌టీ, విశ్వ లో వోలీమ్, శ్రీనివాస చారిటీస్, కరుణ హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

గద్దర్ మృతి తీరని లోటు

గచ్చిబౌలి: ప్రజాయుద్ధనౌక గద్దర్ మృతి తీరని లోటని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. ఆయన మృతి ఎంతగానో కలిచివేసిందన్నారు. మాకు అత్యంత ఆత్మీయుడు, మంచి స్నేహితుడు, ప్రజా సమస్యలపై పోరాటం చేయడమే కాకుండా తనదైన పాటలతో అందరినీ కదిలించిన గద్దర్ అని పేర్కొన్నారు. ఆయన మృతి అందరికీ తీరని లోటని, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానన్నారు.

రేపు సదరం క్యాంపు

జిన్నారం(పటాన్‌చెరు): ఈ నెల 8న నిర్వహించనున్న సదరం క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని గుమ్మడిదల ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో వికలాంగులకు సూచించారు. సదరం క్యాంపును సంగారెడ్డిలోని ప్రభుత్వాసుపత్రిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల ప్రజలు మీ–సేవాలో స్లాట్ బుక్ చేసుకొని క్యాంపులో పాల్గొనాలని సూచించారు.

మణిపూర్ బాధితులకు న్యాయం చేయాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మణిపూర్ బాధ్యత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ నియోజకవర్గ పాస్టర్ అసోసియేషన్, క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం రామచంద్రాపురం పట్టణంలోని ఇక్రిశాట్ నుంచి లింగంపల్లి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నేతలు మాట్లాడుతూ మణిపూర్‌లో మత ఘర్షణలు జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. మణిపూర్ బాధ్యత కుటుంబాలకు వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పాస్టర్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రశాంత్, కుమార్, పీటర్, జైపాల్ పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారానికి పాదయాత్ర చేస్తున్నా'

కూకట్‌పల్లి: ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు కూకట్‌పల్లి డివిజన్‌లో పాదయాత్ర చేస్తున్నానని కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ అన్నారు. అందులో భాగంగా ఆదివారం మైత్రీనగర్‌లో అన్ని విభాగాల అధికారులతో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. సాధ్యమైనంత త్వరంగా పనులు పూర్తి చేస్తాన్నారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, ప్రభాకర్, జగ్గారావు, సత్యనారాయణ, నవీన్, సతీష్, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా సర్వీసు రోడ్డు

మణికొండ: గండిపేట్ మండల పరిధిలోని వట్టినాగులపల్లి శివారులో ఉన్న ఔటర్ సర్వీసు రోడ్డు పక్కన రాత్రి సమయాల్లో నిర్మాణ వ్యర్థాలు, మట్టి కుప్పలను తెచ్చి పోస్తున్నారు. వీటిని నెలలు గడిచినా అలాగే వదిలేయడంతో తరచూ వాహనదారులు ప్రమాదాల పాలవుతున్నారు. ప్రతి నెల ఒకరు మృత్యువాత పడటం, అనేక ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టింకోవడం లేదని విమర్శలున్నాయి. వట్టినాగులపల్లి, కొల్లూరు, ఇంద్రారెడ్డినగర్ తదితర గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా హెచ్ఎండీఏ అధికారులు స్పందించి రాత్రి సమయాల్లో మట్టి పోస్తున్న వాహనాలను సీజ్ చేయటం, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

మేడికుంటకు మహర్దశ

రాయదుర్గం: నానక్‌రాంగూడ ఐటీకారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలో మణిహారంగా ఉండే మేడికుంట రూపురేఖలు పూర్తిగా మారిపోతున్నాయి. మేడికుంట అభివృద్ధితో ఈ ప్రాంతానికే కొత్త శోభ వచ్చే అవకాశం ఉంది. దశాబ్దాల చరిత్ర కలిగినప్పటికీ ప్రస్తుతం దుర్వాసనకు నిలయంగా, కళావిహీనంగా మారిన మేడికుంట సుందరమైన తాటకంగా మార్చేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయి. చుట్టూరా ఉండే ఐటీ సంస్థలలోని ఐటీ ఉద్యోగులు, చేరువలో నివాసముండే వారు సేద తీరేలా ఇక రూపుదిద్దుకోనుంది. విప్రో సర్కిల్‌కు ఆనుకొని ఈ మేడికుంట కొనసాగడంతో దీనికి ప్రాధాన్యత ఏర్పడింది. ఒకప్పుడు జీహెచ్ఎంసీ, నీటిపారుదల శాఖ కొంతమేరకు అభివృద్ధి చేసినా దీన్ని మరింతగా ఆకర్షణీయంగా మార్చే ప్రక్రియ సాగుతోంది.



- ఐటీకారిడార్ విప్రో జంక్షన్‌కు కొత్త శోభ
- చొరవ తీసుకున్న జీహెచ్ఎంసీ, నీటిపారుదల శాఖ
- అభివృద్ధిపై కొనసాగుతున్న చర్యలు

అభివృద్ధిపై మొదటి నుంచి చర్యలు..

- చారిత్రక మేడికుంటను సుందరీకరణకు దీని ముందే ఉండే విప్రో సంస్థ గతంలో దత్తత స్వీకరించింది.
- కొన్నాళ్లపాటు అందంగా తీర్చిదిద్దినా ఆ తర్వాత జీహెచ్ఎంసీ, దశాబ్దం క్రితం నీటిపారుదల శాఖరూ.14 లక్షలతో అలుగు, చెరువు చుట్టూరా కట్ట మరమ్మతు పనులు, గ్రీనరీ పనులు పూర్తి చేశారు.
- అనంతరం ఫీనిక్స్ సంస్థ సుందరీకరించేందుకు ముందుకొచ్చి నీటి శుభ్రతకు తక్కువ వ్యయంతో నానో టెక్నాలజీని వినియోగించింది. చెత్తాచెదారం, వ్యర్థాలు, పిచ్చిమొక్కలను పూర్తిగా తొలగించారు.
- తాజాగా జీహెచ్ఎంసీ, నీటి పారుదల శాఖ రూ.1.72 కోట్ల వ్యయంతో సుందరీకరణ, సంరక్షణ, అభివృద్ధి పనులు చేపట్టాలని ఎమ్మెల్యే, కార్పొరేటర్, మాజీ కార్పొరేటర్ అధికారులతో కలిసి పనులు ప్రారంభించిన విషయం తెలిసిందే.

ఈ చర్యలు అవసరమంటున్న స్థానికులు..

- పరిశుభ్ర వాతావరణం నెలకొలకొనేలా చేయాలి.
- వాకర్స్ కోసం చెరువు చెరువుకట్టపై వాకింగ్ ట్రాక్‌ను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలి.
- సెక్యూరిటీగార్డు, గార్డెనర్‌ను కూడా నియమించాలి.
- చెరువులోకి ఎలాంటి మురుగునీరు, రసాయనాలు చేరకుండా చేయాలి.
- ఫెన్సింగ్, ఫుట్‌పాత్‌ల పరిరక్షణ, ఇతర స్ట్రక్చర్లు, సివిల్ వర్క్‌లను చేపట్టాలి.
- చెరువు పరిసరాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలి.
- చెరువుకట్టపై వాకింగ్‌కు ఎలాంటి ఇబ్బందులు రాకుండా కాలువలపై పైకప్పు ఏర్పాటు చేయాలి.
- చెరువుకట్టపై పచ్చికబయళ్లు, గ్రీనరీ, లైటింగ్, కూర్చోడానికి బెంచీలు ఏర్పాటు చేయాలి.
- మేడికుంటలో బోటింగ్ చేసే సౌకర్యాన్ని కల్పించాలి.
- చెరువులోనే కొనసాగుతున్న బోరుకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా నీటి సరఫరా నానక్‌రాంగూడకు కొనసాగేలా చర్యలు తీసుకోవాలి.
- చెరువు కట్టపై నుంచి అనధికారంగా కొందరు నిర్వహిస్తున్న ద్విచక్రవాహనాల రాకపోకలకు పూర్తిగా నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలి.

దుర్గం చెరువు వద్ద జాతీయ వాస్క్యులర్ డే



కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురభి వాణీదేవి తదితరులు

మాదాపూర్: ఫోన్‌లు, కంప్యూటర్‌లతో జీవన విధానమే మారిపోయిందని ఎమ్మెల్సీ సురభి వాణీదేవి పేర్కొన్నారు. మాదాపూర్‌లోని దుర్గం చెరువు వద్ద వాస్క్యులర్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జాతీయ వాస్క్యులర్ డేను పురస్కరించుకుని శస్త్రచికిత్స రహిత ఇండియా థీమ్‌తో ఆదివారం వాకథాన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వాణీదేవి మాట్లాడుతూ.. రోగం లేని సమాజం కోరుకుందామన్నారు. గతంలో రెండు కిలోమీటర్లు దూరం ఉన్నా నడిచివెళ్లేవారని.. ఇప్పటి పిల్లల్లో ఆ పరిస్థితి లేదన్నారు. ఏసీపీ కేఎస్ రావు మాట్లాడుతూ.. వాస్క్యులర్ సొసైటీ ఆఫ్ ఇండియా చేపట్టిన ఈ కార్యక్రమం అభినందనీయమన్నారు. వాస్క్యులర్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ పీసీ గుప్తా, చీఫ్ ఆర్గనైజర్ వాస్క్యులర్ సర్జన్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా జాతీయ వాస్క్యులర్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నరేంద్రనాథ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల స్ఫూర్తితో ప్రజల పక్షాన పోరాడతాం

మియాపూర్: అమరవీరుల స్ఫూర్తితో ప్రజల పక్షాన ఉండి పోరాడదామని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వనం సుధాకర్ పేర్కొన్నారు. ఎంఏనగర్‌లోని ఎంసీపీఐయూ కార్యాలయంలో డివిజన్ స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజా గాయకుడు గద్దర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మియాపూర్ డివిజన్ కమిటీని ఎన్నుకున్నారు. డివిజన్ కార్యదర్శిగా ఇస్లావత్ దశరథ్ నాయక్, సహాయ కార్యదర్శిగా పల్లె మురళీ, కార్యదర్శి వర్గ సభ్యులు నర్సింహ, మధుసూదన్, లలిత, లావణ్య, శివాణీ, డివిజన్ కమిటీ సభ్యులుగా ఎండీ సుల్తానా బేగం, లక్ష్మి, నాగభూషణం తదితరులున్నారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం



శ్రీనివాస్‌కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ హమీద్‌పటేల్

గచ్చిబౌలి: కాలనీ, బస్తీలలో పూర్తి స్థాయి మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని కొండాపూర్ కార్పొరేటర్ హమీద్‌పటేల్ పేర్కొన్నారు. కొండాపూర్ డివిజన్ శ్రీనివాస్‌కాలనీ వాసుల కోరికపై ఆ కాలనీలో ఆయన ఆదివారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలోని ప్రధాన వీధుల్లో నూతనంగా అంతర్గత డ్రైనేజీ లైన్లు వేయగా, మరికొన్ని చిన్న వీధుల్లో వేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అంతర్గత డ్రైనేజీ అవుట్‌లెట్ సమస్యలను కూడా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని స్థానికులకు హామీ ఇచ్చారు. ఈ అంశాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తామన్నారు. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు మొలిచి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, చెత్తాచెదారం కూడా వేస్తుండడంతో అవికాస్తా చెత్తకు నిలయాలుగా మారిపోతున్నాయని స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. ఇందుకు ఆయన స్పందిస్తూ అధికారులతో మాట్లాడి ఖాళీ స్థలాలకు ప్రహరీల నిర్మాణం చేసేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంగంగౌడ్, బ్రహ్మ, కృష్ణయ్య, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, జయమ్మ, శ్రీనివాస్, గౌరమ్మ, ఆండాలమ్మ, కన్నయ్య, జైరాములు, సౌరమ్‌మిశ్రా తదితరులు పాల్గొన్నారు.


సత్యనారాయణకు సన్మానం

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని అంబేద్కర్ కాలనీకి చెందిన నాయకులు నగేశ్, స్థానిక నాయకులతో కలిసి ఇటీవల గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణను ఆదివారం సన్మానించారు. సత్యనారాయణను ఎమ్మెల్సీగా ప్రభుత్వం ప్రకటించటం సంతోషంగా ఉందని తెలిపారు.

ఎమ్మెల్సీ, మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

జహీరాబాద్ టౌన్: ఎమ్మెల్సీ సత్యనారాయణ, కూకట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కుతాడు రాములును జహీరాబాద్ ఎరుకల సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎరుకల సంఘం అధ్యక్షుడు కెంపుల వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి ఆశోక్, ఉపాధ్యక్షుడు మధుగొండ శ్రీనివాస్, కార్యదర్శి కోహీర్ జగన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలు



ప్రత్యేక అలంకారంలో అమ్మవారు



రవికుమార్‌యాదవ్, బీజేపీ నాయకులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

గచ్చిబౌలి: ఆల్విన్‌కాలనీ, గంగారం, చందానగర్, మసీదు బండ వంటి ప్రాంతాల్లో నల్లపోచమ్మ ఆలయాల్లో బోనాల వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ పాల్గొనగా ఆయనను ఆయా ఆలయ కమిటీ సభ్యులు సత్కరించి అమ్మవారి దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా ఆలయ కమిటీ సభ్యులు, బీజేపీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని ఆయా కాలనీల్లో ఆదివారం పారిశుద్ధ్య పనులను చేపట్టారు. శానిటరీ అధికారి వినోద్ ఆధ్వర్యంలో నిల్వ ఉన్న నీటి ద్వారా దోమలు వ్యాపిస్తుండటంతో రసాయన మందులతో పరిసరాలను పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

'భవిష్యత్ కాంగ్రెస్ దే' !

మణికొండ: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి పూర్వ వైభవం సంతరించుకుంటుందని మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎం.జితేందర్ అన్నారు. ఆదివారం పార్టీ ఆధ్వర్యంలో మణికొండ మర్రిచెట్టు సర్కిల్, మణికొండ క్వార్టర్స్‌లలో కాంగ్రెస్ పార్టీ జెండాలను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికలకు పార్టీ క్యాడర్‌ను సమాయత్తం చేసే క్రమంలో మున్సిపాలిటీ పరిధిలో జెండా పండగను నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి నుంచి వచ్చే ఎన్నికల వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికులుగా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పార్టీ కౌన్సిలర్లు బి.పద్మారావు, కె.లక్ష్మీనారాయణ, నాయకులు ముత్యాలు, కిరణ్‌కుమార్, మాల్యాద్రినాయుడు తదితరులున్నారు.

దేవాలయానికి రోడ్డు వేయాలి

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల మచిలేశ్వరాలయానికి ఔటర్‌రింగ్ రోడ్డు నుంచి సీసీ రోడ్డు వేయాలని నార్సింగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎం. ప్రవీణ్‌యాదవ్ కోరారు. ఆదివారం గ్రామస్తులతో ఆయన సమావేశం నిర్వహించి ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. ప్రతి సోమవారం దేవాలయానికి వెళ్లే భక్తుల సంఖ్య పెరుగుతోందన్నారు. ప్రతి ఏటా శివరాత్రికి లక్షకు మించి జనం దేవాలయానికి వస్తున్నారన్నారు. మరిన్ని మౌలిక సదుపాయాలు పెరిగితే దేవాలయం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. వందల ఎకరాల దేవాలయ భూమి అన్యాక్రాంతం, ఇతరుల ఆధీనంలో ఉన్నా పట్టించుకోని అధికారులు ఓ విల్లా ప్రాజెక్టు వారి కోసమే రోడ్డును అడ్డుకోవటం సరికాదన్నారు.



అలరించిన నృత్యప్రదర్శన

మాదాపూర్: కళాకారులు కూచిపూడి నృత్యాలతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామం ఆంపిథియేటర్‌లో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం ఉమా మహేశ్వరీ శిష్యబృందంచే కూచిపూడి నృత్యప్రదర్శన నిర్వహించారు. ఇందులో అంబపరకు, రంగపూజ, పుష్పాంజలి, వరవల్లభ రమణ, పాలనేత్రానల, అయిగిరినందిని, అలరులు కురియగ, కలశపురం, శివాష్టకం, సూర్యాష్టకం, వసంత జతిస్వరం, అర్ధనారీశ్వరం తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు. కళాకారులు అధ్యా, అక్షయ, అమేయ, హాసిని, హిమ, జోషిత, కౌస్తుబి, కిరణ్మయి, కృతి, ప్రీతిక, రియాంశిక, సాహితి, సమీక్ష పాల్గొన్నారు.

హఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్ పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన



వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తున్న రైల్వే అధికారులు, యోగానంద్, సత్యనారాయణ

హఫీజ్‌పేట్: అమృత్ భారత్ స్టేషన్ల పథకంలో భాగంగా హఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్ పునరుద్ధరీకరణ పనులకు ఆదివారం వర్చువల్ కార్యక్రమంలో శంకుస్థాపన చేశారు. ఈ ప్రారంభోత్సవానికి శేరిలింగంపల్లి కంటెస్టెడ్ ఎమ్మెల్యే, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గజ్జల యోగానంద్, మొవ్వ సత్యనారాయణ, జిల్లా నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణలో అమృత్ భారత్ స్టేషన్ల పథకంలో 21 స్టేషన్‌లకు సంబంధించిన ఆధునీకరణ పనులను ప్రధానీ నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారన్నారు. ఆధునీకరించడంతో పాటు స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచి ప్రయాణికులకు వెయిటింగ్ హాల్స్, టాయిలెట్స్, లిఫ్టులు, ఎస్కలేటర్లు, ఉచిత వైఫై సదుపాయాన్ని కల్పించనున్నారన్నారు. హఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్ పెరుగుతున్న ప్రయాణికుల అవసరాలను తీర్చే ఉద్దేశంతో ఏబీఎస్ఎస్ పథకం కింద ఎంపిక చేశారన్నారు. 12 వేల ప్రయాణికుల సంఖ్యతో సుమారు 96 రైళ్ల సర్వీసుల రాకపోకలు సాగిస్తున్నారన్నారు. సబర్బన్ స్టేషన్‌గా అభివృద్ధి చెంది, నగరంలోని పశ్చిమ ప్రాంతాల్లోని ప్రయాణికుల సౌకర్యార్థం ఈ స్టేషన్‌ను రూ.26.60 కోట్లతో అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ కింద అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్ దుకాణాలు, ప్రయాణికులకు అవసరమైన సమాచారం అందించే వ్యవస్థలు, ఎగ్జిక్యూటివ్ లాంజ్ ఏర్పాటు చేస్తున్నారన్నారు. నరేంద్ర మోదీ పాలనలో దేశం శుభిక్షంగా ఉందని, ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. తెలంగాణలో కూడా బీజేపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు, బీజేపీ రాష్ట్ర, అసెంబ్లీ, జిల్లా నాయకులు నాగులు, బుచ్చిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి



అవగాహన కల్పిస్తూ వైద్య సేవలందిస్తున్న వైద్యులు

రాయదుర్గం: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కాంటినెంటల్ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి సూచించారు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని కాంటినెంటల్ ఆస్పత్రిలో ఎస్‌బీఐ విశ్రాంత అధికారులు, ఉద్యోగులకు ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం వారికి ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డాక్టర్లు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అందరూ ప్రతినిత్యం వాకింగ్, యోగా, ధ్యానం వంటి కూడా చేయడం చాలా అవసరమన్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అనేక వ్యాధులు సంక్రమిస్తూ ఉన్నాయని, వాటి పట్ల అవగాహన కలిగి జాగ్రత్తలు తీసుకోవడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సందర్భంగా 500 మంది ఎస్‌బీఐ విశ్రాంత ఉద్యోగులు, అధికారులు, వారి కుటుంబ సభ్యులకు వైద్య సేవలను అందించారు. ముఖ్యంగా ఎండోక్రైనాలజీ, ఆర్థోపెడిక్స్, కార్డియాలజీ, గ్యాస్ట్రోఎంట్రాలజీ, న్యూరాలజీ, గైనకాలజీ, పల్మనాలజీ, ఇంటర్నల్ మెడిసిన్, ఫిజియోథెరపీ వంటి నిపుణులతో వైద్య సేవలను అందించడంతోపాటు అవగాహన కల్పించారు. కాంటినెంటల్ ఆస్పత్రి వైద్యాధికారులు, వైద్య బృందం, కెవిఆర్‌ప్రసాద్, ఎస్‌బీఐ డిప్యూటీ మేనేజర్ కెఆర్ఎస్ శ్యామ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



చిన్నారులు ర్యాంప్ వాక్‌చేస్తూ సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో ఆదివారం ఇండియా కిడ్స్ ఫ్యాషన్ వీక్‌ని నిర్వహించారు. 8 మంది డిజైనర్లు రూపొందించిన వస్త్రాలను చిన్నారులు ధరించి ర్యాంప్‌పై క్యాట్ వాక్ చేశారు. 350 మందికి చిన్నారులు వినూత్న పద్ధతిలో, వివిధ రకాల వస్త్రాలను ధరించి ఆకట్టుకున్నారు. పలు రకాల బ్రాండ్స్ ఆర్య, అన్య, త్రిశ, డాక్టర్ రాజేశ్వరీ తదితర బ్రాండ్‌లను ప్రదర్శించారు. – మాదాపూర్

ఆకట్టుకున్న సకల కళా సంగమం



సాక్షి, సిటీబ్యూరో: విభిన్న రకాల కళల సమ్మేళనంగా జరిగిన దేవర్స్ స్టే క్యూరియస్ నగరవాసుల్ని ఆకట్టుకుంది. మాదాపూర్‌లోని శిల్పాహిల్స్‌లో ఉన్న గ్యాలరీ 78లో జరుగుతున్న ఈ ఈవెంట్ ముగిసింది. విభిన్న రకాల కళలను ఒకే వేదికపైకి తీసుకువచ్చేలా సాగుతున్న ఈ వైవిధ్యభరిత సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ఫ్యాషన్, సంప్రదాయ నృత్యం, సంగీతాలను గుదిగుచ్చి ప్రదర్శించారు.. సంగీతజ్ఞుడు, ఎలక్ట్రానిక్ సంగీత విద్వాంసుడు మూర్తోవిక్ అలియాస్ శ్రీరామ మూర్తి భరతనాట్యం నర్తకి అనహిత చలిహా, కర్ణాటక గాయని గోపికా జైరామ్, దృశ్యకళాకారుడు అనిరుద్ధ్ మెహతా సంగీత సాంకేతిక నిపుణుడు మైల్స్ తదితరులు తమదైన శైలి కళారూపాలను ఈ వేదికపై ఆవిష్కరించారు. డిజైనర్ కావ్య పొట్లూరి 'ది ఫ్యూచరిస్టిక్ బ్రైడ్' ఫ్యాషన్ ప్రియుల్ని ఆకట్టుకుంది. సినీ నిర్మాత నాగ్ అశ్విన్ ఈ కార్యక్రమానికి హాజరై ఆహుతలతో సంభాషించారు. ఈ ఈవెంట్ తొలుత జూలై 15న ముంబై జరిగిందని హైదరాబాద్ తర్వాత దేశవ్యాప్తంగా మరిన్ని నగరాల్లో దీన్ని ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహక సంస్థ దేవర్స్ ప్రతినిధులు తెలిపారు.

జయశంకర్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ సాయిబాబా, బీఆర్ఎస్ నాయకులు



లింగంపల్లిలో.. కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్

రాయదుర్గం: ఖాజాగూడలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్‌సార్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి మాజీ కార్పొరేటర్ సాయిబాబా ఆధ్వర్యంలో పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. బీఆర్ఎస్ నాయకులు చెన్నంరాజు, జంగయ్యయాదవ్, అంజమ్మ, వసంత్‌కుమార్, అశోక్‌యాదవ్, నారాయణ, రమేష్‌గౌడ్, శ్రీనివాస్, జగదీష్, రాజేందర్, అనీల్ పరమేష్, ఫయాజ్,కృష్ణ, ఖాదర్‌ఖాన్ పాల్గొన్నారు.

చందానగర్ హుడా కాలనీలో..

హఫీజ్‌పేట్: జయశంకర్ జయంతిని పురస్కరించుకొని చందానగర్ హుడా కాలనీలో విశ్వకర్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఆదివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ రామస్వామియాదవ్, చందానగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, నాయకులు అక్బర్ ఖాన్, వెంకటేష్, నరేందర్, జ్ఞానేశ్వర్, విశ్వకర్మ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షులు అడ్లూరు రవీంద్రచారి పాల్గొన్నారు.

లింగంపల్లిలో..

శేరిలింగంపల్లి: లింగంపల్లిలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూల మాలలు వేసి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా జయశంకర్ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. పలువురు బీఆర్ఎస్ పార్టీ శేరిలింగంపల్లి డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జయశంకర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తదితరులు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225455
9912225462